సాక్షి
కర్నూలు
సోమవారం, 2, అక్టోబర్, 2023



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళ తాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



ఖగ్గల్‌లో చిరుత సంచారం

మంత్రాలయం: మండల పరిధిలోని ఖగ్గల్ సమీపంలో ఉన్న కొండల్లో చిరుత పులి సంచరిస్తోంది. దీంతో సమీపంలోని పంట పొలాలకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు.



ఆదర్శమూర్తి.. ఉద్యమ దీప్తి

భారత స్వాతంత్య్రోద్యమంలో భాగంగా మహాత్మా గాంధీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు సార్లు పర్యటించారు. మహాత్ముడి ఉపన్యాసాలు లక్షలాది మందిలో ఉద్యమ స్ఫూర్తిని నింపాయి. 8లో

న్యూస్‌రీల్

ఎల్లెల్సీలో 713 క్యూసెక్కుల నీటి ప్రవాహం



హొళగుంద వద్ద ప్రవహిస్తున్న ఎల్లెల్సీ

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో 713 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. కొద్ది రోజులుగా కాలువలో ప్రవాహం నిలకడగా ఉంటోంది. తుంగభద్ర జలాశయం పూర్తి సామర్థ్యం 1633 అడుగులుండగా సోమవారం 1617.94 అడుగులతో 105.788 టీఎంసీలకు గాను 55.737 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 1,220 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో 9,781 క్యూసెక్కులుంది.

నేటి 'స్పందన' రద్దు

కర్నూలు(సెంట్రల్): గాంధీ జయంతి సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలెవరూ దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చి ఇబ్బంది పడొద్దని ఆమె సూచించారు.

వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తోందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా అన్నారు. ఆదివారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఏ.క్యాంప్‌లోని హార్టికల్చర్ హాలులో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టం-2007ను పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి రెవెన్యూ డివిజన్‌లోనూ ట్రిబ్యునల్ ఉంటుందని, ఆర్డీఓ అధ్యక్షుడిగా ఉండేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. వివిధ సేవలందించిన పది మంది వయోవృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో కర్నూలు సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ జయప్రకాష్, సహదేవరెడ్డి, నాగరాజు, క్రిష్టఫర్, రత్నం రెడ్డి పాల్గొన్నారు. అనంతరం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ప్రాధాన్యత భవనాలు పూర్తి చేయాలి



ఇంజినీర్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఈఎన్‌సీ బాలునాయక్

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాధాన్యత భవన నిర్మాణాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలునాయక్ ఆదేశించారు. ఆదివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన పంచాయతీరాజ్ ఇంజినీర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ.. ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణాలకు ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. వేర్వేరు దశలో కొనసాగుతున్న పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే విడుదలవుతాయన్నారు. రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాలను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాలను నవంబర్ 15వ తేది నాటికి పూర్తి చేయాలని చెప్పారు. ఈ నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైతే సంబంధిత డీఈఈ, ఏఈలు గ్రామాల్లోనే ఉండాలని తెలిపారు. సమావేశంలో పీఆర్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఈఈలు మద్దన్న, వెంకటప్రసాద్, రామోహన్, రామకృష్ణారెడ్డి, రెండు జిల్లాలకు చెందిన డీఈఈలు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించి.. రబీ ఆశలు పెంచి!

ప్రారంభమైన రబీ సీజన్

- రికార్డు స్థాయిలో 67,094 క్వింటాళ్ల శనగ విత్తనాలు
- రైతు భరోసా కేంద్రాల్లో విత్తన పంపిణీ
- రబీ సాధారణ సాగు 1.28 లక్షల హెక్టార్లు
- ఈ ఏడాది 2.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశం
- సీజన్‌లో రూ.2033.32 కోట్ల పంట రుణాలు
- సిద్ధంగా 1.30 లక్షల టన్నుల రసాయన ఎరువులు

కర్నూలు(అగ్రికల్చర్): అన్నదాతకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఖరీఫ్ కొంత నిరాశకు గురి చేసినా రబీ ఆశలు పెంచింది. కొద్ది రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. ముందస్తుగా విత్తన పంపిణీ కూడా చేపట్టడం రైతులకు ఉపశమనాన్ని ఇస్తోంది. విత్తనాలను ఆర్‌బీకే స్థాయిలోనే పంపిణీ చేస్తుండటం విశేషం. ఖరీఫ్ సీజన్ సెప్టెంబర్ నెల 30తో ముగియగా.. అక్టోబర్ 1 నుంచి రబీ సీజన్ మొదలైంది. వర్షాల నేపథ్యంలో రబీ పంటల సాగు జోరందుకుంది. రబీ పంటలు ప్రధానంగా నల్ల రేగడి నేలల్లో వేస్తారు. జిల్లాలో ఈ నేలలు ఎక్కువగా ఉండటంతో రబీలో పప్పు శనగ, జొన్న, ధనియాలు, మినుము.. బావులు, బోర్లకు కింద వేరు శనగ, వరి సాగు చేస్తారు. ప్రభుత్వం వైఎస్ఆర్ రైతు భరోసా కింద ఇప్పటికే రెండ దఫాలుగా రైతులకు పెట్టుబడి సాయం అందించింది. అక్టోబర్ నెలలో మూడో విడత పెట్టుబడి సాయం అందించేందుకు రంగం సిద్ధం చేసింది.



రబీ సీజన్‌లో పొలంలో విత్తనం వేస్తున్న రైతులు

రికార్డు స్థాయిలో శనగ విత్తనం కేటాయింపు

ఉమ్మడి జిల్లా చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కర్నూలు జిల్లాకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తోంది. గతంలో 25 లేదా 33 శాతం సబ్సిడీతో శనగ విత్తనాల పంపిణీ జరిగేది. జిల్లాకు 67,094 క్వింటాళ్లు కేటాయించగా పంపిణీ చురుగ్గా సాగుతోంది. అర్ధ ఎకరాకు 20కిలోలు, ఎకరాకు 40కిలోల ప్రకారం 5 ఎకరాల వరకు విత్తనాలు ఇస్తున్నారు. క్వింటా పూర్తి ధర రూ.8,100గా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ పోను రైతులు క్వింటాకు రూ.4,860 ప్రకారం చెల్లించాల్సి ఉంది.

రైతులకు ఎంతో మేలు



గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం ఎకరాకు 40 కిలోల ప్రకారం శనగ విత్తనాలు 40 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తుండటం శుభపరిణామం. గతంలో ఎకరాకు 25 కిలోల ప్రకారం ఇస్తుండటంతో సరిపోక మళ్లీ కొనల్సి వచ్చేది. నేను 5.73 ఎకరాల్లో శనగ వేస్తున్నా. సబ్సిడీపై 10 ప్యాకెట్ల(200 కిలోలు) శనగ విత్తనాలు ఇస్తుండటం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేస్తోంది.
– ఎస్.సంజీవరెడ్డి, మల్లెపల్లి గ్రామం, వెల్దుర్తి మండలం

శనివారం మధ్యాహ్నం సమయానికి జిల్లాలో 7,264 మంది రైతులు 9,655 క్వింటాళ్ల శనగ విత్తనం కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

రబీలో రూ.2,033.32 కోట్ల పంట రుణాలు

ఖరీఫ్‌లో బ్యాంకులు రైతుల అభ్యున్నతి లక్ష్యంగా పెద్ద ఎత్తున పంట రుణాలు పంపిణీ చేశాయి. ఖరీఫ్ పంట రుణాల పంపిణీ లక్ష్యం రూ.2926.01 కోట్లు కాగా.. సెప్టెంబర్ చివరి నాటికి లక్ష్యాన్ని మించి పంట రుణాలు పంపిణీ చేసినట్లు స్పష్టమవుతోంది. రబీ పంట రుణాల లక్ష్యం రూ.2033.32 కోట్లు కాగా.. రేపటి నుంచి బ్యాంకులు పంట రుణాలు పంపిణీ చేయనున్నాయి. రబీ పంట రుణాలకు సంబంధించి లక్ష్యాలను 27 బ్యాంకులకు కేటాయించారు.

ఆశాజనకంగా వర్షాలు

సెప్టెంబరు నెలలో కురిసే వర్షాలపై రబీ భవితవ్యం ఆధారపడి ఉంటుంది. ఈ నెలలో ఆశాజనకంగా వర్షాలు పడటంతో రబీ సీజన్ గట్టెక్కే అవకాశం ఏర్పడింది. ఒక మోస్తరు వర్షాలే అయినప్పటికీ అన్ని మండలాల్లో పంటల సాగుకు అవసరమైన మేర కురవడం విశేషం. సెప్టెంబరు నెల సాధారణ వర్షపాతం 116.5 మిమీ ఉండగా.. 104.6 మిమీ వర్షపాతం నమోదైంది.

సెప్టెంబరు నెలలో వర్షపాతం వివరాలు..

తేదీ	నమోదైన వర్షపాతం (మి.మీలలో)
3	19.8
4	30.8
5	7.5
6	6.6
10	2.1
22	7.8
24	5.1
25	6.1
26	7.6
28	4.6
30	6.6



ప్రభుత్వం అందించిన సబ్సిడీ శనగ విత్తనాలను చూపుతున్న రైతులు

ఎరువుల సమాచారం

	అంచనా(టన్నుల్లో)	ప్రస్తుత నిల్వ(టన్నులు)	ఆర్బీకేల్లో నిల్వ(టన్నులు)
యూరియా	46,000	8614.72	2700.94
డీఏపీ	1,12,500	4597.94	965.5
ఎస్ఎస్‌పీ	2,200	1135.95	---
ఎంఓపీ	4,500	918.105	---
కాంప్లెక్స్	60,500	31487	1722.75

(గమనిక: ప్రతి నెలా సరఫరా ప్రణాళిక మేరకు ఎరువులు జిల్లాకు చేరుతుంటాయి.)

ఆర్బీకేల్లోనే విత్తనాలు



రబీ సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధమైంది. ఎరువులు, విత్తనాలకు ఎలాంటి కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. విత్తనాలను ఆర్‌బీకేల ద్వారానే పంపిణీ చేస్తున్నాం. ఎరువులు కూడ అవసరమైన మేరకు స్థానికంగానే అందుబాటులో ఉంచాం. బ్యాంకుల నుంచి రైతులకు పంట రుణాలు ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.
– పి.లలిత వరలక్ష్మి, డీఏఓ, కర్నూలు

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ఈ నెల 3వ తేదిన జరిగే ప్రాంతాలను ఆదివారం అధికారులు ప్రకటించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని క్యాబులా కాలనీ యూపీహెచ్‌సీ, మండలంలోని ఏనుగుబాల, వెల్దుర్తి మండలంలోని గోవర్ధనగిరి, తుగ్గలి మండలంలోని రాతన, పెద్దకడుబూరు మండలంలోని చిన్నతుంబళం-1, పత్తికొండ మండలంలోని దేవనబండ, ఓర్వకల్లు మండలంలోని కాల్వ, నందవరం మండలంలోని కనకవీడు-1, మంత్రాలయం మండలంలోని మంత్రాలయం-3, మద్దికెర మండలంలోని ఎం. అగ్రహారంలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. అలాగే కర్నూలు నగరంలోని శరీన్‌నగర్ యూపీహెచ్‌సీ, మండలంలోని దిన్నెదేవరపాడు, కృష్ణగిరి మండలంలోని కంబాలపాడు, కౌతాళం మండలంలోని కౌతాళం-3, కోసిగి మండలంలోని కోసిగి-5, కోడుమూరు మండలంలోని కోడుమూరు-2, కల్లూరు మండలంలోని బస్తిపాడు-2, హొళగుంద మండలంలోని హొళగుంద-2, హాలహర్వి మండలంలోని గూళ్యం-1, గూడూరు మండలంలోని చనుగొండ్ల-1, గోనెగండ్ల మండలంలోని ఒంటెడుదిన్నెలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. దేవనకొండ మండలంలోని దేవనకొండ-2, చిప్పగిరి మండలంలోని నగరడోణ, సి.బెళగల్ మండలంలోని సి.బెళగల్-1, ఆస్పరి మండలంలోని ములుగుందం-1, ఆదోని మండలంలోని ధనాపురం, పట్టణంలోని అరుంధతీనగర్ యూపీహెచ్‌సీలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించనున్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న రగ్బీ క్రీడాకారులు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి రగ్బీ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీసుబ్బారెడ్డి, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

- హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్

కర్నూలు (లీగల్): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం ఉదయం జిల్లా కోర్టు హాల్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షతన ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులతో పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గడిచిన తొమ్మిది నెలలకు సంబంధించి కోర్టుల వారీగా ఆయా న్యాయమూర్తులు నివేదికలు సమర్పించారు. జిల్లాలో కేసుల పరిష్కారం సంతృప్తికర స్థాయిలో జరుగుతోందని, రానున్న రోజుల్లో న్యాయమూర్తులు ఇదే విధంగా కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి కోరారు. సమావేశంలో అదనపు జిల్లా జడ్జీలు, సబ్ జడ్జీలు, జూనియర్ సివిల్ జడ్జీలు పాల్గొన్నారు.

ఊరూరా 'స్వచ్ఛతా' స్ఫూర్తి

- శ్రమదానంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కర్నూలు (అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఆదివారం జిల్లా వ్యాప్తంగా కొనసాగింది. 2వ తేదీన జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ' ఏక్ తారీఖ్ .. ఏక్ గంట ... ఏక్ సాత్ ' పేరుతో ఈ కార్యక్రమం చేపట్టారు. గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయా ప్రాంతాలను శుభ్రం చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజలను భాగస్వామ్యం చేసి ఆయా వీధులను శుభ్రం చేశారు. ప్రతి గ్రామ పంచాయతీల్లో రెండు ప్రాంతాలను ఎంపిక చేసుకొని శ్రమదానం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వంద మంది వరకు ప్రజలను సమీకరించి, సమష్టిగా శ్రమదానం చేశారు. గ్రామ ముఖ ద్వారాలు, మార్కెట్ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా, ప్రార్థనా మందిరాలు తదితర ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ సర్పంచు, పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీ, క్షేత్ర స్థాయి సిబ్బంది ఏర్పాట్లు చేశారు. శ్రమదానం కార్యక్రమాల్లో చెత్త, చెదారాలను సమీపంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లకు తరలించేందుకు వీలుగా పారకలు, ట్రైసైకిల్స్, ఇతర పారిశుద్ధ్య పనిముట్లను వినియోగించుకున్నారు. కోడుమూరులో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ జి.సుధాకర్, జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు చీపుర్లు పట్టి స్థానిక సంత మార్కెట్ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఆలూరు, హాలహర్వి మండలాల్లోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఎంపీడీఓ, పంచాయతీ సిబ్బంది, కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఆదోని మండలం మండగిరి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో వీధులను శుభ్రం చేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలోని అందరు ఎంపీడీఓ, డీఎల్‌పీఓలు ఈ కార్యక్రమం వంద శాతం విజయవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.



కోడుమూరులో వీధులను శుభ్రం చేస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే సుధాకర్, డీపీఓ నాగరాజు నాయుడు

తంచన్‌గా మురి 'పింఛన్'

- ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ
- అవ్వాతాతల ముఖాల్లో వెల్లివిరిసిన సంతోషం



కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో పింఛన్ పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ శివలీల, అదనపు పీడీ షరీఫ్



ఎమ్మిగనూరు మండలం మల్కాపురంలో బత్తిని గౌరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కళ్యాణ్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో తంచన్‌గా ఒకటో తేదీనే వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి 16 రకాల పింఛన్లు పంపిణీ చేశారు. పొలాల్లో పనిచేస్తున్న వారికి, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి కూడా పింఛన్ నగదు అందజేశారు. కర్నూలు జిల్లాలో 2,47,021 లబ్ధిదారులు ఉండగా సాయంత్రం 4 గంటల సమయానికి 1,50,985 మందికి(61.09 శాతం) పంపిణీ చేశారు. అలాగే నంద్యాల జిల్లాలో 2,33,210 మంది లబ్ధిదారులు ఉండగా 1,47,229 మందికి(65.96 శాతం) పింఛన్లు అందజేశారు. గ్రామ, వార్డు వలంటీర్లు ఉదయమే వచ్చి పింఛన్ మొత్తాన్ని ఇవ్వడంతో అవ్వాతాతల ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది. పింఛన్ల పంపిణీలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల, డీఆర్‌డీఏ అదనపు పీడీ షరీఫ్ పర్యవేక్షించారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్లు అందజేయనున్నారు.



హొళగుందలో గాలెమ్మకు వృద్ధాప్య పింఛన్ ఇస్తున్న వలంటీరు విజయలక్ష్మి



కల్లూరు మండలం దొడ్డిపాడులో జులేఖాబీకి పింఛన్ ఇస్తున్న వలంటీర్ ఖుతిజాబీ

శ్రీమఠం.. భక్తజనసంద్రం



శ్రీమఠం ముఖద్వారంలో భక్తుల కోలాహలం



బంగారు పల్లకీలో బృందావన ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం: సద్గురు శ్రీ రాఘవేంద్రస్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చి స్వామి సేవలో తరించారు. ఆది, సోమవారాలు సెలవురావడంతో మంత్రాలయ మఠంలో భక్తుల రద్దీ పెరిగింది. దీంతో రాఘవేంద్రస్వామి దర్శనానికి 3 గంటలకు పైగా సమయం పట్టింది. సర్వ, సేవా , ప్రత్యేక దర్శనం క్యూలైన్లు ఉదయం నుంచే కిటకిటలాడాయి. తుంగభద్ర నదికి వర్షపు నీరు రావడంతో తీర ప్రాంతం సైతం భక్తులతో కళకళలాడింది. గ్రామ దేవత మంచాలమ్మ, అన్నపూర్ణ భోజన శాల, పరిమళ ప్రసాదం, పంచామృతం, తీర్థ ప్రసాద కౌంటర్లు భక్తులతో కిక్కిరిశాయి. శ్రీమఠం మేనేజర్ వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్ భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కనుల పండువగా బంగారు పల్లకోత్సవం

శ్రీమఠంలో బంగారు పల్లకోత్సవం కనులపండువగా సాగింది. ఆదివారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో ఉదయం ప్రహ్లాదరాయల బంగారు పాదుకల పూజ, రాములోరి సంస్థాన పూజ, బంగారు పల్లకీ సేవలు చేపట్టారు. ముందుగా డోలోత్సవ మంటపంలో ఊంజలపై బృందావన ప్రతిమను కొలువుంచి సేవా భక్తులతో సంకల్పం జరిపించారు. అనంతరం బంగారు పల్లకీలో శ్రీమఠం ప్రాకారంలో భక్తజన హర్షధ్వానాలు, మంగళవాయిద్యాల మధ్య రమణీయంగా ఊరేగింపు నిర్వహించారు. సేవా భక్తులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీర్వచనం చేశారు.

క్లుప్తంగా

హస్తకళలను ప్రోత్సహిద్దాం

● లేపాక్షి క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని



లేపాక్షి క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్‌): హస్తకళలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కర్నూలులోని దేవీ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక ప్రదర్శన, అమ్మకాల ఎగ్జిబిషన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 40కిపైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. స్టాళ్లలోని హస్తకళలను ఎమ్మెల్యే కాటసాని ఆసక్తిగా పరిశీలించారు. చేనేత వస్త్రాలు, హస్తకళలకు ఆదరణ తగ్గే అవకాశం లేదని అన్నారు. ఎగ్జిబిషన్‌ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేపాక్షి హస్త కళా ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య మాట్లాడుతూ... ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 15 వరకు ఉంటుందని పేర్కొన్నారు. సెలవు రోజులతో సహా ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ నడుస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, లేపాక్షి హస్తకళల ఎంపోరియం సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్పందన రద్దు

కర్నూలు: గాంధీ జయంతి సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు వేసినట్లు ఎస్పీ కృష్ణకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసాలకు వచ్చి ఆర్జీదారులు పోలీసు కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికిరావద్దని పేర్కొన్నారు.

ఆటోలో బంగారు నగలు మాయం

కర్నూలు: ఏపీఎస్‌పి రెండో బెటాలియన్‌లో పనిచేస్తున్న ఎఆర్ఎస్సై సుబ్బారెడ్డికి సంబంధించిన బంగారు నగలు ఆటోలో మాయమయ్యాయి. భార్య ప్రమీలతో కలిసి ఈనెల 26వ తేదీన కొత్తబస్టాండ్‌కు ఎదురుగా ఉన్న గోపీ హోటల్‌లో టిఫిన్ చేసి వెంకటరమణ కాలనీలోని ఇంటికి ఆటోలో వెళ్లారు. అందులో మరో ఇద్దరు యువకులు సైతం ప్రయాణించారు. బ్యాగ్‌లో ఒక బ్యాక్స్‌లో భద్ర పరచిన 12 తులాల బంగారు నగలు మాయమయ్యాయి. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో బాధితుడు సుబ్బారెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

ఆదర్శమూర్తి.. ఉద్యమ దీప్తి

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండుసార్లు పర్యటించిన గాంధీజీ
● తుంగభద్ర నదీ తీరంలో మార్మోగిన వందేమాతర నినాదం
● నేడు మహాత్ముని జయంతి

"ప్రపంచంలో నువ్వు చూడాలనుకుంటున్న మార్పు మొదట నీతోనే మొదలు కావాలి" అని అన్నారు గాంధీజీ. విలువలే మనుషుల్ని మహనీయులని చేస్తాయని ప్రవచించిన మహాత్ముడు జాతీయోద్యమంలో భాగంగా రెండుసార్లు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ఉపన్యాసాలు లక్షలాది మందిలో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని నింపాయి. వేలాది మందిని స్వాతంత్ర్య సంగ్రామంలో మమేకం చేశాయి. అక్టోబర్ 2వ తేదీ సోమవారం గాంధీజీ జయంతి సందర్భంగా మహాత్ముని మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుందాం.

కర్నూల కల్చరల్: భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా స్వరాజ్య నిధికి విరాళాల సేకరణకు మహాత్ముడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. ద్రోణాచలం నుంచి 1921 అక్టోబర్ 1వ తేదీన రైలులో గాంధీ కర్నూలు వచ్చారు. ఓపెన్ టాప్ జీపులో నగర వీధుల్లో తిరిగారు. ఆర్ఎస్ సర్కిల్, ఎస్‌టీబీసీ కళాశాల, స్టేట్ బ్యాంక్ సర్కిల్, పాత బస్టాండ్, గడియారం ఆసుపత్రి, పూలబజార్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా మేడం వెంకయ్య ఇంటికి చేరుకున్నారు. గాంధీని చూడటానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. అప్పటి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మేడం వెంకయ్య శెట్టి, రంగనాథ మొదలియార్, గొల్లపూడి సీతారామ శాస్త్రి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు మహాత్ముడి వెంట ఉన్నారు. తుంగభద్ర నదీ తీరంలో నిర్వహించిన బహిరంగ సభలో మహాత్ముడు హిందీ ప్రసంగించగా.. గాడిచెర్ల తెలుగులో అనువదించారు. స్వరాజ్య సాధన కోసం ప్రతి ఒక్కరూ సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొనాలని గాంధీజీ పిలుపునిచ్చారు. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమం గురించి కూడా గాంధీజీ విపులంగా తెలియజేసినప్పుడు సభలో పెద్ద పెట్టున హర్షధ్వానాలు మారుమోగాయి. సభానంతరం మేడం వెంకయ్య శెట్టి వ్యక్తిగత విరాళం కింద రూ.1,116 గాంధీజీకి ఇచ్చారు.

1929లో ఖద్దర్ యాత్ర

1929లో ఖద్దరు నిధికి విరాళాలు సేకరించేందుకు గాంధీజీ కర్నూలు జిల్లాలో రెండో సారి పర్యటించారు. జిల్లాలోని చాగలమర్రి, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, నంద్యాల, అయ్యలూరు, పాణ్యం, కర్నూలు, కొణిదేడు, నాగలాపురం, ప్యాలకుర్తి, కోడుమూరు, దేవనకొండ, పత్తికొండ, ఆదోని ప్రాంతాల్లో పర్యటించారు. గాంధీజీతో పాటు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, పత్రికా సంపాదకులు వనం శంకరశర్మ, డి.సంజీవరెడ్డి, తొమ్మండ్ర వెంకటనర్సయ్య, అగ్రహారం నర్సింహారెడ్డి, సి.బజార్ రెడ్డి, హెచ్.మాణిక్య రావు, పెండేకల్ రెడ్డి లక్ష్మమ్మ, కాదర్‌బాద్ నర్సింగ రావు ఖద్దరు నిధికి విరాళాలు సేకరించి గాంధీజీకి అందించారు.



కర్నూలు వన్‌టౌన్‌లో గాంధీజీ బస చేసిన మేడం వెంకయ్య శెట్టి బంధువు గరిపాకటి ఇల్లు

మహాత్ముడు మెచ్చిన పర్ల కంబళ్లు

కర్నూలు నుంచి కోడుమూరు వెళ్లే మార్గంలో నాగలాపురంలో పర్ల గ్రామ వాస్తవ్యులు గాంధీజీని ఆపి తాము తయారు చేసిన కంబళ్లను చూపించారు. గాంధీజీ పర్ల కంబళ్లను చూసి నచ్చడంతో వారిని అభినందించారు.

ఆధునిక యోగి



సత్యాగ్రహాన్ని పోరాట మార్గంగా చూపించిన ఆధునిక యోగి మహాత్మాగాంధీ. తన జీవితాన్ని సత్య ప్రయోగశాలగా మర్చుకున్నారు. మత విద్వేషాలను పోగొట్టాలని ప్రయత్నం చేసి, తన జీవితాన్ని బలి ఇచ్చిన త్యాగమూర్తి. మహాత్ముని అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలి.

– డాక్టర్ తొగట సురేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు, డోన్

గాంధీ మార్గంలో నడవాలి



అహింస, శాంతి ద్వారా దేన్నయినా సాధించ వచ్చని, ప్రేమ ద్వారా ప్రగతిని పొందవచ్చని చాటి చెప్పిన జాతిపిత మహాత్మా గాంధీ తరతరాలకు ఆదర్శ ప్రాయం. సహనం, పట్టుదల, కార్యదీక్ష, శ్రమ జీవనం వీటన్నింటికి యువత ప్రాధాన్యతనిస్తూ ప్రగతిని సాధించడానికి గాంధీజీ మార్గంలో నడవాలి.

– పూజారి రవికుమార్, ప్రధానోపాధ్యాయులు, తూడిచర్ల


రగిలిన స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి

కర్నూలు జిల్లాలో గాంధీజీ చేసిన రెండు పర్యటనలు స్థానిక నాయకుల్లో చక్కని స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించాయి. గాడిచర్ల హరిసర్వోత్తమ రావు గాంధీజీ స్ఫూర్తితో రాజీ లేని పోరాటం చేశారు. తొలి రాజకీయ ఖైదీగా జైలు జీవితం గడిపారు. ఆంధ్ర తిలక్‌గా గుర్తింపు పొందారు. గాంధీ పర్యటన కర్నూలు వాసుల గుండెల్లో చక్కని పోరాట స్ఫూర్తిని కల్గించింది.



కర్నూలులో గాంధీజీ (ఫైల్)

రావి ఆకుపై బాపూజీ



ఎమ్మిగనూరు టౌన్: జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల జయంతిని పురస్కరించుకొని పట్టణానికి చెందిన కదిరికోట అశోక్ ఆదివారం రావి ఆకుపై వారి చిత్రాలను చిత్రించి అబ్బురపరిచారు. గతంలో బియ్యపు గింజ, అగ్గిపెట్టెపై పలువురి చిత్రాలను గీసి స్థానికుల ప్రసంశలు పొందారు. ప్రస్తుతం రావి ఆకుపై మహనీయుల చిత్రాలను చిత్రించి స్థానికుల నుంచి అభినందనలు పొందారు.

అపాస్ నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపాస్)నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం నగరంలోని ఓ స్కూల్‌లో జరిగిన ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా చిన్న నాగస్వామి నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, జిల్లా కోశాధికారిగా వెంకట రమణ, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా తాయప్ప, మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా ఎస్.రామ్ మోహన్ రెడ్డి, ఎన్నికల అధికారులుగా పి.కోదండరాంజీ, ఎం.వి సురేంద్రబాబుజీ, కృష్టార్జున రెడ్డి వ్యవహరించారు.

నేటి నుంచి 'ఉపాధి' ప్రణాళిక

● డిసెంబరు 31లోపు పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024–25 సంవత్సరానికి అవసరమైన ప్రణాళికలు తయారీకి గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నెల 2న ఈ ప్రక్రియ మొదలై డిసెంబరు చివరి నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఒక పనిదినం అంటే రూ.448 ఉంటుంది. ఇందులో రూ.272 లేబర్ కాంపోనెంటు, రూ.176 మెటీరియల్ కాంపోనెంటు ఉంటుంది. ఈ ప్రాతిపదికన 2024–25 సంవత్సరం కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసే విధంగా ఆదేశాలు జారీ అయినట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. అక్టోబరు 2న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ఆధ్వర్యంలో మొదటి గ్రామ సభ నిర్వహించాల్సి ఉంది. మొదటి గ్రామసభలో వచ్చే ఆర్థిక సంవత్సరం ప్లానింగ్ గురించి అవగాహన కల్పిస్తారు. అక్టోబరు 20 నాటికి పంచాయతీల వారీగా ఉన్న పనుల పునఃపరిశీంచి నవంబరు 10 నాటికి క్షేత్రస్థాయిలో ప్లానింగ్ పూర్తి చేస్తారు. నవంబరు 30న మండల ప్రణాళికలపై మండల పరిషత్ ఆమోదం తీసుకుంటారు. డిసెంబరు 15న జిల్లా పరిషత్ ఆమోదం తీసుకుంటారు. డిసెంబరు 31 నాటికి గ్రామ, మండల, జిల్లా పరిషత్‌ల ఆమోదంతో పాటు లేబర్ బడ్జెట్ పనులన్నింటికీ జిల్లా కలెక్టర్ నుంచి పరిపాలన అనుమతులు తీసుకుంటారు. దీంతో 2024–25 ప్లానింగ్ ప్రాసెస్ మొత్తం పూర్తి అవుతుంది. ఇందులో భాగంగా సోమవారం కర్నూలు శివారులోని డ్వామా శిక్షణ కేంద్రంలో ప్లానింగ్ ప్రాసెస్‌పై క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సృజన ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

నిందితుడిపై పీడీ యాక్ట్ కేసు

● కడప సెంట్రల్ జైల్‌కు తరలింపు
● నిందితుడి భార్య ఆత్మహత్యాయత్నం

డోన్ టౌన్: పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న శ్రీరాంనగర్‌కు చెందిన ఎరుకల మురళిపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మురళిపై డోన్‌తో పాటు వివిధ జిల్లాల్లో గంజాయి, చోరీ, తదితర 11 కేసులు నమోదైనట్లు తెలిపారు. కాగా తన భర్త మురళి గత నెల 29వ తేదీన జైలు నుంచి బయటకు వచ్చిన కొద్దిసేపటికే మళ్లీ పోలీసులు తీసుకెళ్లారని, ఎక్కడ ఉన్నాడో ఆచూకీ చెప్పలేదని భార్య భూలక్ష్మీ పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసింది. కొద్ది సేపటి తర్వాత నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. మురళిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి కడప జైలుకు తరలిస్తున్నామని పోలీసులు ఆమెకు వివరించారు. ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అతివలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● నారీ శక్తి సమ్మేళనంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన

కర్నూలు కల్చరల్: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అన్నారు. ఆదివారం వీఆర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో జరిగిన నారీ శక్తి సమ్మేళనంలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. ఇలాంటి స్ఫూర్తి దాయకమైన సమ్మేళనాలు ఎన్నో జరగాలని అప్పుడే దేశ సమగ్ర అభివృద్ధికి బాటలు వేయగలుగుతామని అన్నారు. చిన్మయమిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద మాట్లాడుతూ మహిళా శక్తి మహోన్నతమైందన్నారు. కుటుంబ వ్యవస్థ బాగుండాలన్నా, సమాజం, దేశం బాగుండాలన్నా, అభివృద్ధి జరగాలన్నా నారీమణుల చేతుల్లోనే ఉందన్నారు. ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు ఐటీ ఇండస్ట్రీ టీమ్ లీడర్, హైదరాబాద్ సామజిక కార్యకర్త ముదిగొండ సుస్మ, తాడేపల్లి గూడెం స్పందన ఫౌండేషన్ చైర్ పర్సన్ బోగిరెడ్డి ఆదిలక్ష్మి రెడ్డి ముఖ్య వక్తలు హాజరై ప్రసంగించారు. మహిళలు ఏ రంగంలో తీసిపోరని చెప్పారు. మహిళా శక్తి సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రంగంలో సమస్యలు ఉంటాయని, వాటిని అధిగమించి ముందుకు సాగాలన్నారు. దేశం మొత్తం మీద నాలుగు వందల సమ్మేళనాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో ఇది రెండో సమ్మేళనం అన్నారు. వివిధ అంశాలపై చర్చా గోష్టులు నిర్వహించారు. అనంతరం ప్రదర్శించిన యోగాసనాలు, నృత్య ప్రదర్శనలు, నృత్య రూపకాలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ శమంతకమణి, మాంటిస్సోరి ఇండస్ పాఠశాల కరస్పాండెంట్ గాయని రాజశేఖర్, కార్తీక దీపోత్సవ కమిటీ అధ్యక్షులు పద్మావతి, నిర్వాహకులు రాధిక, దేవకి దేవి, కృష్ణ వేణి, భవాని, రజిని, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన



నృత్య ప్రదర్శన

చంద్రబాబు ఇక తప్పించుకోలేరు

● టీడీపీ మోతమోగిద్దాం కార్యక్రమం విఫలం
● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు(రాజ్‌విహార్): సీఎంగా ఉన్న సమయంలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడి దొరికిపోయిన చంద్రబాబు ఇక తప్పించుకోలేరని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం స్థానిక సి.క్యాంప్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి సానుభూతి పొందేందుకు తెలుగుదేశం పార్టీ పిలుపు ఇచ్చిన మోత మోగిద్దాం కార్యక్రమం పూర్తిగా విఫలమైందని ఈ కార్యక్రమాలకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆ పార్టీ నేతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. 14ఏళ్ల పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు రాష్ట్ర ప్రజల సంపదను కొల్లగొట్టారన్నారు. రెండెకరాల నుంచి రూ. లక్షల కోట్లకు ఆయన ఎలా ఎదిగారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు హయాలో ప్రవేశపెట్టిన స్కీములన్నింటిలోనూ స్కాములు జరిగాయని, వాటిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రింగ్ రోడ్డు, అమరావతిలో రాజధాని పేరుతో రైతుల నుంచి సేకరించిన భూమిపై కూడా విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. లోకేష్, ఇతర టీడీపీ పెద్దల పాత్రపై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేశ్వరరెడ్డి, యూనుస్, ధనుంజయ ఆచారి, లక్ష్మీ కాంతయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

గుర్తు తెలియని మృతదేహం

కర్నూలు: పాతబస్టాండ్ నుంచి జొహరాపురం వెళ్లే మార్గంలో బ్రిడ్జి కింద గుర్తు తెలియని మృతదేహం బయటపడింది. నీళ్లలో నుంచి ఒడ్డుకు కొట్టుకొని రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఒకటో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతుడికి సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, చామనఛాయ కలర్, నలుపు తెలుపు గీతల షర్టు, జీన్స్ ప్యాంట్ ధరించాడని ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



ఇద్దరు వ్యక్తులను అరెస్టు చూపుతున్న ఆలూరు పోలీసులు

ఆలూరు రూరల్: వాహన తనిఖీల్లో రూ.50 వేలు విలువ చేసే 8 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడింది. ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆదివారం ఆలూరు పోలీసు స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. హత్తిబెళగల్ గ్రామం సమీపంలో వాహన తనిఖీలు చేస్తుండగా.. అరికెర గ్రామానికి చెందిన గాదిలింగ,తిక్క స్వామి అనే వ్యక్తులు స్కూటర్‌పై అక్రమంగా తరలిస్తున్న మద్యంను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. హాలహర్వి మండలం అర్ధగేరి గ్రామానికి చెందిన మంజు అనే వ్యక్తి ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని సింధవాళం క్రాస్ వద్ద ఉన్న వైన్ షాప్ నుంచి ఆదోని, ఆలూరు తదితర ప్రాంతాలకు కర్ణాటక మద్యం సరఫరా చేయిస్తున్నట్లు విచారణలో తెలిందన్నారు. అక్రమ మద్యం సరఫరాలో ఎవరెవరు ఉన్నారని విచారించి అరెస్టు చేస్తామన్నారు. తనిఖీల్లో ఏఎస్ఐలు తిరుపాల్ నాయక్, చంద్రశేఖర్ హెడ్ కానిస్టేబుల్ జానీ వాకర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారన్నారు.